

నేడు అంతర్జాతీయ జానపద దినోత్సవం

జాతి సంస్కృతికి దర్పణం
జానపదం

శ్రమజీవులు సృష్టించుకున్న గీతం

ప్రజల నోళ్లలో సజీవంగా ఉండి ఒక తరం నుంచి మరోతరానికి వ్యాప్తి చెందే జానపద విజ్ఞానం అమూల్యం-అపారం. జానపద సాహిత్యం, ఆచారాలు, వస్తు సంస్కృతి, జానపద కళలు-వీటన్నిటి సమాహారమే జానపద విజ్ఞానం. ఒక జాతి సంస్కృతికి దర్పణం ఆ జాతి జానపద విజ్ఞానం. ఆ నాటి సమాజానికి ప్రతిబింబం. దేశ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం. ప్రాచీన జానపద విజ్ఞానం మూలాల పైనే నేటి శిష్ట సాహిత్యం, కళలు నిలిచి ఉన్నాయి.

- వేళచ్చేరి





అంతర్జాతీయ జానపద దినోత్సవం

ఆధునిక సమాజంలో జానపద విజ్ఞానం నిరాదరణకు గురవుతోంది. జానపద సాహిత్యం, కళలను పునరుద్ధరించకపోతే అవి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. కొన్ని కళలకు కాలదోషం పట్టి క్షీణించిపోయాయి. ఈ నేపథ్యంలో జానపద కళారూపాలను బతికించుకోవాల్సిన అవసరం ఉండడంతో ఆ ప్రయత్నం దిశగా అడుగులు పడుతున్నాయి. దాని ఫలితంగా అంతర్జాతీయ జానపద కళా దినోత్సవం ఆవిర్భవించింది.



ఒక విదేశీ భాషా శాస్త్రవేత్త 1846 ఆగస్టు 22న తాను రాసిన వ్యాసంలో 'ఫోక్' (జానపదం) అనే పదాన్ని ఉపయోగించారని, ఆ స్ఫూర్తితో ఆగస్టు 22న జానపద దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా దేశ సంస్కృతికి పట్టుగొమ్మలైన జానపద కళలను రక్షించుకొనే ప్రయత్నం చేయడం ఒక శుభ పరిణామం. జానపద కళారూపాలకు పూర్వవైభవం కల్పించడమే అంతర్జాతీయ జానపద కళా దినోత్సవ ప్రధానోద్దేశం.

పాల్కురికి సోమనాథుడిని తెలుగు వారి మొదటి జానపద విజ్ఞాన శాస్త్ర కళాకారుడిగా పేర్కొంటారు. ఆనాటి జీవన సంస్కృతిని, కళారూపాలను తాను రచించిన పండితారాధ్య చరిత్ర, బసవ పురాణాల్లో విశదీకరించారు. ఎంతో మంది తమ కృతుల్లో ఆనాటి జానపద సంస్కృతి గురించి తెలియజేశారు.





జానపద కళారూపాల ఆవిర్భావం...

జానపద సాహిత్యంతో బాటే జానపద కళలు కూడా పుట్టి ఉండవచ్చు. కష్టించి పనిచేసి అలసిన మనసుకు, శరీరానికి సాంత్వన కలిగించే ప్రయత్నంలో ఈ జానపద గేయం పుట్టింది. దానిని లయబద్ధంగా పాడడానికి, సంగీతం తోడైంది, కళగా రూపొందింది. మాట పాటగా, పాట కళగా ఆకారం దాల్చింది. ఆ కళలను సొంతం చేసుకుని కొందరు వృత్తిగా మార్చుకోడంతో వృత్తి కళాకారుల ఆవిర్భావం జరిగింది. వీరి ద్వారా జానపద సాహిత్యం, కళలు ఎన్నో ప్రాంతాలకు విస్తరించాయి. ఆయా ప్రాంతాల్లో లభ్యమయ్యే వనరులకు మేధోశక్తిని జోడించి కళారూపాలకు ప్రాణం పోశారు కళాకారులు. అందుకే వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు కళారూపాలు పుట్టాయి.

ఏ పాటకైనా సంగీతం, వాద్య సహకారం ఉంటేనే అది మరింత రాణిస్తుంది. అనాది నుంచి దేవతలు మొదలు వీధుల్లో తిరిగే భిక్షకుల వరకు, ఏదో ఒక వాద్యాన్ని ఉపయోగిస్తున్నారు.. పశువుల కాపరి కూడా పశువులు కాస్తూ పిల్లనగ్రోవి వినిపిస్తుంటాడు. జనపదాల్లోని కళాకారులు తమకందుబాటులోని వస్తువుతో వాద్యాన్ని తయారుచేసుకొని వాయిస్తుంటారు.

వాయిద్యాల్లో పలు రకాలున్నాయి. మట్టి కుండ, గుమ్మెటలు మొదలైనవి, చర్మంతో చేసే డప్పు, తప్పెట వగైరాలు, తీగలనుపయోగించి చేసే ఏక్‌తారా, కిన్నెర, తంబుర మొదలైనవి, గాలి వూది వాయించే పుల్లగొయ్య, సన్నాయి ముఖవీణ, కొమ్ము మొదలైనవి వాయిద్యాలున్నాయి. మరెన్నో జానపద వాయిద్యాలు కనుమరుగయ్యాయి.. ఇంకొన్ని రూపాంతరం చెందాయి. జానపద కళల్లో నృత్యాలు, గాథలు, ప్రదర్శనలు అని మూడు రకాలున్నాయి. డప్పు నాట్యం, డొల్ల నృత్యం, గరగ నృత్యం, తప్పెటగుళ్లు, కోలాటం ఇవన్నీ జానపద నృత్యాల కిందికి వస్తాయి. బుర్ర కథ, ఒగ్గు కథ, తోలు బొమ్మలాట, జంగం కథ వగైరాలు జానపద గాథలకు సంబంధించినవి, యక్షగానం, భామాకలాపం, వీధి నాటకం, పగటి వేషం మొదలైనవి జానపద ప్రదర్శనలు.

ఈ జానపద కళారూపాలు ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకమైన కళారూపం కనువిందు కలిగిస్తుంది. గిరిజన నృత్యాలు, ధింసా నృత్యం, రేలా మొదలైనవి కొన్ని ప్రాంతాల కళారూపాలు. జానపద కళల్లో బాగా ప్రచారంలోకి వచ్చింది తోలుబొమ్మలాట. ఇది తర్వాత యక్షగానానికి దారితీసిందంటారు. పగటి వేషగాళ్ల వారి స్వభావాలను వర్ణిస్తూ వినోదం కలిగిస్తారు. ఇవే కాకుండా తప్పెటగుళ్లు. మురళి కోలాటం, జడ కోలాటం వంటివి మెదడుకు పదును పెడతాయి. గంగిరెద్దుల వాళ్లు, చెంచులు, హరిదాసులు ఇలా ఎందరో మనోరంజనంతో పాటు పురాణాల గాథలను జానపదగేయాల ద్వారా పలికిస్తుంటారు. ఎన్నో జానపద కళారూపాలు ప్రజా ఉద్యమాల్లో కొత్త రూపుదాల్చి జనచైతన్యం కలిగించాయి.

జానపద కళారూపాలు ప్రతి ప్రాంతానికి, ప్రతి రాష్ట్రానికి కూడా వైవిధ్యతను సంతరించుకున్నాయి. తమిళనాట పలు జానపద కళారూపాల నేటికీ వన్నె, వాసి తరగకుండా ప్రజల మధ్యన తిరుగాడుతున్నాయి. 'బొమ్మలాట్టం' అనే తోలుబొమ్మలాట తమిళనాట ప్రాచుర్యంలో ఉంది. 'చక్కై ఆట్టం' అనే జానపద నృత్యం మురుగన్ లేదా మరియమ్మన్ వంటి తమిళ దేవతలకు ప్రార్థనగా ప్రదర్శించబడుతుంది. కైసిలంబాట్టం' దేవాలయాల్లో దుర్గ, కాళి వంటి స్త్రీ దేవతలను స్తుతించేందుకు చేసే నృత్యం. 'కరకాట్టం' తలపై కుండలు పెట్టుకొని చేసే జానపద నృత్యం. 'కోలా ట్టం', 'కుమ్మి ఆట్టం', 'కురవంజి', పాంబు ఆట్టం', 'కావడి ఆట్టం', 'మయిలాట్టం', 'పరై ఆట్టం', 'పులి ఆట్టం' మొదలైన ఎన్నో జానపద కళారూపాలు తమిళనాట వివిధ ప్రాంతా ల్లో నేటికీ ప్రదర్శింపబడుతున్నాయి.సినిమాలు, టీవీలు, సెల్ ఫోన్లు లేని కాలంలో ఈ వృత్తికళాకారుల ప్రదర్శనలే ప్రజలకు మనోరంజకాలు. జీవనసమరంలోని సుఖదుఃఖాలను ఆధారంగా చేసుకుని వెలసిన ఈ జానపద కళారూపాలు విజ్ఞానం, వినోదం పంచి ఇచ్చే ప్రాచీన సంస్కృతికి తార్కాణాలు. వీటిని అంతరించి పోకుండా పరిరక్షించుకోవాలి. నేటి లోనికి ముద్దవెళ్లినప్పుడే ఆటపాటలు ఆనందంగా బయటకు వస్తాయి.ఈ జానపద కళారూపాలను, కళాకారులను ప్రభుత్వ వివిధ చర్యల ద్వారా ప్రోత్సహిస్తోంది. కొన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కూడా ఈ కళలకు సంబంధించిన కోర్సులున్నాయి. ఆయా జానపద కళల్లో నిష్ణాతులైన వారిని పద్మశ్రీ వగైరా పురస్కారాలతో ప్రభుత్వం గౌరవిస్తోంది. జానపద కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తీసుకోవాలి. అప్పుడే ఆ కళలకు మనుగడ కలుగుతుంది. అంతర్జాతీయ జానపద కళా దినోత్సవాలకు సార్థకత లభిస్తుంది.



సీఎంతో భేటీ అయిన ఉన్నతాధికారులు

కృష్ణగిరి లైంగిక వేధింపుల వ్యవహారం

15 రోజుల్లో తేల్చండి

దర్యాప్తు కోసం ఉన్నతాధికారుల కమిటీ ● సీఎం స్టాలిన్ ఆదేశం

ప్యారీస్, ఆగస్టు 21: కృష్ణగిరి జిల్లా గాంధీకుప్పంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఇటీవల జరిగిన విద్యార్థినులపై లైంగిక వేధింపుల వ్యవహారాన్ని రాష్ట్రప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోంది. ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, డీజీపీ శంకర్ జివాల్, సామాజిక సంక్షేమం, మహిళా హక్కుల శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, సామాజిక భద్రత కమిషనర్ జానీటామ్ వర్గీస్ సహా ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. కృష్ణగిరి జిల్లా గాంధీకుప్పంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో నకిలీ ఎన్‌సీసీ శిబిరం నిర్వహించి, ఓ బాలికపై అత్యాచారం జరపడంతో పాటు పలువురు విద్యార్థినులపై లైంగిక వేదింపులకు పాల్పడిన సిబ్బంది వ్యవహారంలో అన్ని చర్యలను పదిహేను రోజుల్లోగా ముగించాలని సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల గాంధీకుప్పం ప్రాంతంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో ఎన్‌సీసీ పేరుతో శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో పాల్గొన్న విద్యార్థినుల్లో కొంతమంది లైంగిక వేధింపులకు గురైనట్లు తెలిసింది. దీనిపై బర్గూర్ మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి 11 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి శివరామన్ వద్ద జరిపిన విచారణలో అతను నకిలీ ఎన్‌సీసీ శిబిరం జరిపినట్లు తెలిసింది. అతను శిబిరంలో పాల్గొన్న 17 విద్యార్థినులకు పంపిణీ చేసిన పతకాలు, జ్ఞాపికలు, ఎన్‌సీసీ స్టిక్కర్లు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శివరామన్ పదమూడేళ్ల విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడని, మరో 13 మంది విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురైనట్లు విచారణలో తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ వ్యవహారంలో సంబంధిత పాఠశాలకు సెలవు ప్రకటించి పోలీసు భద్రత కూడా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఇదిలా ఉండగా, కృష్ణగిరిలాగే రాష్ట్రంలోని మరికొన్ని పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఇలాంటి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిసింది. ఈ విద్యాసంస్థల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు జరిగాయా? ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు చోటుచేసుకున్నాయా? అని విచారణ జరిపి సంబంధితులపై కఠిన చర్యలు తీసుకొనే రీతిలో ఉన్నతాధికారుల దర్యాప్తు కమిటీని సీఎం నియమించారు. ఈ కమిటీతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి స్టాలిన్.. కృష్ణగిరి ఘటనపై సమగ్ర విచారణ జరిపి అన్ని చర్యలు పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం 60 రోజుల్లోపు ఛార్జిషీటు దాఖలుచేసి నిందితులను చట్టం ముందు నిలిపి కఠినశిక్ష పడేలా వ్యవహరించాలంటూ సీఎం ఉత్తర్వులు జారీచేశారు.

మూడేళ్లలో 31 లక్షల మందికి ఉద్యోగాలు

రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ● 28 పరిశ్రమల శంకుస్థాపనలో సీఎం

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్ల డీఎంకే ప్రభుత్వపాలనలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావడంతో పాటు 31 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. బుధవారం నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మితమవుతున్న 28 పరిశ్రమలకు శంకుస్థాపన చేయడంతో పాటు 19 పారిశ్రామిక పథకాలను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తమిళనాట పరిశ్రమల ఏర్పాటులో రికార్డు సాధించామని, అభివృద్ధిలోనూ చరిత్ర సృష్టించామన్నారు. ఒకేరోజు ఇన్ని పరిశ్రమలకు శంకుస్థాపన చేయడమంటే రాష్ట్ర ఆర్థిక బలాన్ని ప్రపంచానికి చూపిన రోజుగా గుర్తుండిపోతుందన్నారు. తమిళనాడుకు ప్రకాశవంతమైన భవిష్యత్తు ఉందని నిరూపించే రోజు ఇదని వ్యాఖ్యానించారు. గత జనవరిలో ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడు జరిపామని, దానికంటే కూడా ఎన్ని పెట్టుబడులు తెచ్చామనేదానిపైనే విజయం ఆధారపడి వుందన్నారు. ఆ మహానాడులో వివిధ సంస్థలతో 631 ఒప్పందాలు చేసుకున్నామని, రూ.6.64 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని, దాని మూలంగా 14 లక్షల మందికి ప్రత్యక్షంగానూ, 12 లక్షల మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. గడిచిన మూడేళ్లలో 31 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు కల్పించామన్నారు. రూ.9 లక్షలా 74 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వివరించారు. తమిళనాడు ప్రశాంతమనే భావన పారిశ్రామికవేత్తల్లో నెలకొందని, అందుకే పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా రాష్ట్రానికి వస్తున్నాయని సీఎం వివరించారు. పరిశ్రమలను స్థాపిస్తేనే చాలదని, మీలాంటి మరికొంతమంది పారిశ్రామికవేత్తలను కూడా తీసుకురావాలని స్టాలిన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. తమిళనాడు పరిశ్రమల శాఖ రాయబారులుగా మారాలని విన్నవించారు. తాము పాలన చేపట్టిన మూడేళ్లలో తమిళనాడు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మోటారు వాహనాలు, ఐటీ, మెడికల్ ఉపకరణాలు, ఆహారోత్పత్తి, రసాయనాలు, టెక్స్‌టైల్ తదితరాలకు సంబంధించిన పలు పరిశ్రమలను స్థాపించామన్నారు. ఇందువల్ల లక్షా 6 వేల మందికి పైగా ఉద్యోగాలు లభించాయన్నారు. రాష్ట్రాభివృద్ధిలో తమ ప్రభుత్వం ఏమాత్రం అలక్ష్యం చూపడం లేదన్నారు. పరిశ్రమల స్థాపనకు అన్ని సదుపాయాలు కల్పించామని, వాటిని వినియోగించుకోవాలని సీఎం పారిశ్రామికవేత్తలకు సూచించారు.



కార్యక్రమంలో సీఎం, పారిశ్రామికవేత్తలు

28 పరిశ్రమలకు శంకుస్థాపన

తిరువళ్లూరు జిల్లాలో మెడికల్ ఎక్విప్‌మెంట్ తయారు చేసే పరిశ్రమ, కాంచీపురం జిల్లాలో మోటారు విద్యుత్ స్పేర్ పార్ట్స్ పరిశ్రమ, తిరువణ్ణామలై జిల్లాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ పరిశ్రమ, చెంగల్పట్టు, విరుదునగర్, కృష్ణగిరి జిల్లాల్లో సుందరం ఫాస్టనర్స్ పరిశ్రమ, చెంగల్పట్టులో రేనాల్ట్, నిస్సాన్, కృష్ణగిరిలో వెగ్ పరిశ్రమ, ఈరోడ్డు, తిరుప్పూర్‌లో టెక్స్‌టైల్ మిల్కీ మిస్ట్, ఈరోడ్డులో ఆహారభద్రతా విభాగం తదితరాలకు సీఎం శంకుస్థాపన చేశారు. అదే విధంగా తూత్తుకుడిలో గ్రీన్‌హైడ్రోజన్ సంస్థ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు కూడా పాల్గొన్నారు.

చెన్నై విమానాశ్రయంలో ఎం-పాక్స్ పరీక్షలు

● ప్రారంభించిన మంత్రి సుబ్రమణ్యం



కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుబ్రహ్మణ్యం

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా ఖండాన్ని దడపుట్టిస్తున్న మంకీ పాక్స్ (ఎం-పాక్స్) నివారణకు రాష్ట్రంలోనూ చర్యలు మొదలయ్యాయి. కేంద్రప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో విదేశాల నుంచి వస్తున్న ప్రయాణీకులను పరీక్షించేందుకు అంతర్జాతీయ విమానాశ్రయాలు, హార్బర్లలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటయ్యాయి. చెన్నై విమానాశ్రయంలో ఏర్పాటైన పరీక్షా (స్క్రీనింగ్) కేంద్రాన్ని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. శరీర ఉష్ణోగ్రత, తలనొప్పి, ఒంటినొప్పులు, శరీరంపై కణుతులకు సంబంధించి ఈ కేంద్రంలో పరీక్షలు చేస్తున్నారు. వైద్యబృందం పరీక్షించాకే ప్రయాణీకులను బయటకు అనుమతిస్తున్నారు. తిరుచ్చి, కోయంబత్తూరు, మదురై విమానాశ్రయాల్లోనూ తీవ్ర పరీక్షలు జరుపుతున్నారు. అవసరమైతే ఆయా ప్రయాణీకులను ఆస్పత్రికి తరలించేందుకు అనువుగా అంబులెన్సులను కూడా సిద్ధం చేసి పెట్టారు. అదేవిధంగా తాత్కాలిక ఐసోలేషన్ గదులను కూడా ఏర్పాటు చేశారు. ప్రజలంతా అప్రత్తంగా వుండాలని ఈ సందర్భంగా మంత్రి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు.

సమాచార ధ్వని

26 పాఠశాలలకు హరిత పురస్కారాలు

ఐసిఎఫ్, ఆగస్టు 21: రాష్ట్రంలో 26 పాఠశాలలకు హరిత పురస్కారాలను అటవీ శాఖ ప్రకటించింది. రాష్ట్రంలో కూరగాయల తోట, సోలార్ ప్యానళ్ల ద్వారా విద్యుదుత్పత్తి చేయడంలో ప్రతిభ, కృషి వంటి వాటిని గుర్తించి హరిత పురస్కారాలను అటవీ శాఖ అందజేస్తోంది. ఈ ఏడాది పురస్కారాలకు 26 పాఠశాలలను ఎంపిక చేసింది. ఒక్కో పాఠశాలకు తలా రూ.20 లక్షలు అందజేసేందుకు రూ.5.20 కోట్లను అటవీ శాఖ కేటాయించింది.

అన్నాసాలైలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, ఆగస్టు 21: స్థానిక అన్నాసాలైలో పోలీసులు ట్రాఫిక్ మార్పులు చేపట్టారు. నగరంలో కార్ రేస్ జరుగనుండడంతో అన్నాసాలై, శివానంద రోడ్డు, కామరాజర్ రోడ్డు, కొడిమర రోడ్డు రహదారుల్లో బారికేడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.. ప్రస్తుతం పల్లవన్ రోడ్డు-ఐల్యాండ్ గ్రౌండ్ వరకు అన్నాసాలైలో ఈ పనులు చేపడుతుండడంతో ట్రాఫిక్ మార్పులు చేపట్టారు. టూ వేగా ఉన్న అన్నాసాలైను వన్‌వేగా మార్చారు. పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వారాంతపు సెలవుల్లో ప్రత్యేక బస్సులు

పెరంబూర్,ఆగస్టు21:ముహూర్తపు రోజైన శుక్రవారం, శని, ఆదివారాలు, సోమవారం (27వ తేది) కృష్ణ జయంతి వరుస సెలవులు కావడంతో ప్రజలు స్వగ్రామాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 23 నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. కిలంబాక్కం నుంచి పలు నగరాలకు శుక్ర, శనివారాల్లో 485 బస్సులు, ఆది, సోమవారాల్లో తిరువణ్ణామలైకు 60 బస్సులు నడపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి శుక్ర, శనివారాల్లో 70 బస్సులు, మాధవరం నుంచి శుక్రవారం 20 బస్సులు నడపనున్నారు. బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ నుంచి ఇతర నగరాలకు 350 బస్సులు నడపనున్నారు. సెలవుల అనంతరం తిరిగి వచ్చే వారి కోసం అదనపు బస్సులు నడపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

అరక్కోణం మార్గంలో రైలు సేవల్లో మార్పులు

ఐసిఎఫ్,ఆగస్టు21:అరక్కోణం రైల్వే యార్డులో ఈ నెల 22,24 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.10 గంటల వరకు అభివృద్ధి పనులు చేపడుతుండడంతో, 8 రైళ్ల వేళల్లో మార్పులు చేశారు.చెన్నై సెంట్రల్-అరక్కోణం ఉదయం 9.10, 11, సెంట్రల్-తిరుత్తణి ఉదయం 10 గంటల వెళ్లే రైళ్లు తిరువళ్లూర్ వరకు మాత్రమే నడువనున్నాయి. అరక్కోణం-సెంట్రల్ ఉదయం 11.15, మధ్యాహ్నం 12 గంటల రైళ్లు తిరువళ్లూర్ నుంచి బయల్దేరనున్నాయి. తిరుత్తణి-సెంట్రల్ మధ్యాహ్నం 12.35 గంటల రైలు కూడా తిరువళ్లూర్ నుంచి బయల్దేరనుంది. వేలూరు కంటోన్మెంట్-అరక్కోణం ఉదయం 10 గంటల రైలు చిత్తేరి వరకు నడువనుంది. సెంట్రల్-తిరుపతి ఉదయం 9.50గంటల రైలు తిరుత్తణి నుంచి బయల్దేరనుంది.

250 ఫుట్‌పాత్ దుకాణాల తొలగింపు

ఐసిఎఫ్, ఆగస్టు 21: స్థానిక అన్నానగర్, అమింజికరై ప్రాంతాల్లో 250 ఫుట్‌పాత్ దుకాణాలను కార్పొరేషన్ అధికారులు తొలగించారు. అరుంబాక్కం, విల్లివాక్కం, తిరుమంగళం, అన్నానగర్, అమింజికరై ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి తోపుడు బండ్లు, ఫాన్సీ స్టోర్లు, టీ స్టాళ్లు, బిర్యానీ దుకాణాలు వంటివి నడుపుతున్నారు. ప్రజలు నడిచి వెళ్లేందుకు వీలులేకుండా ఆక్రమించడంతో వాటిని తొలగించాలని అన్నానగర్ మండల అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కార్పొరేషన్ అధికారులు, అన్నానగర్ 2వ అవెన్యూ ప్రాంతంలో 120 దుకాణాలు, అన్నానగర్ టవర్ సమీపంలో 80 దుకాణాలు, అమింజికరై తిరువిక పార్క్ సమీపంలో 50 దుకాణాలను మంగళవారం తొలగించారు. ఇకపై ఆక్రమణలకు పాల్పడితే రూ.50,000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నందంబాక్కం-గిండి కొత్త మెట్రో మార్గం

ఐసిఎఫ్, ఆగస్టు 21: మెట్రోరైలు పనుల కోసం నందంబాక్కం-గిండి కొత్త మార్గాన్ని సీఎంఆర్ఎల్ రూపొందించింది. నగరంలో రెండో విడత మెట్రో పథకంలో మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్ ఒకటి. మాధవరం పాల కేంద్రం నుంచి అన్నా నగర్, కోయంబేడు, ఆలందూర్, పుళిదివాక్కం, కోవిలంబాక్కం, మేడవాక్కం జంక్షన్ రోడ్డు, పెరుంబాక్కం మీదుగా షోలింగనల్లూర్ వరకు కొనసాగుతుంది. బట్ రోడ్డు ప్రాంతంలో మెట్రో పనులు చేపట్టేందుకు సెయింట్ థామస్ మౌంట్-పూందమల్లి రోడ్డులో వాహన రాకపోకలు నిలిపివేసేందుకు నిర్ణయించారు. వాహనచోదకులు ఇబ్బంది పడకుండా ఉండేలా నందంబాక్కం వర్తక కేంద్రం ఎదుట నుంచి కత్తిపార ఈకాట్టుతాంగల్, జీఎస్‌టీ రోడ్డు, ఒలిపింయా టెక్ పార్క్ జంక్షన్ వరకు కొత్త రోడ్డు ఏర్పాటుచేసి ఆ మార్గంలో వాహనాలు నడిపేందుకు నిర్ణయించారు. 1 కి.మీ దూరం ఏర్పాటుచేసిన ఈ కొత్త మార్గంలో రెండేళ్లు వాహన రాకపోకలు జరుగనున్నాయని. దీనికి సంబంధించిన ట్రయల్ రన్ వచ్చే వారం జరుగనుందని అధికారులు తెలిపారు.

సహకార సంఘాల్లో డిపాజిట్ పెంపు

ఐసిఎఫ్, ఆగస్టు 21: సహకార సంఘాల్లో వ్యక్తిగత డిపాజిటి రూ.30 లక్షలకు పెంచారు. సహకార శాఖ ఆధ్వర్యంలో 4,451 ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాలున్నాయి. పంట రుణాలు, నగలపై రుణాలు వంటివి వివిధ విభాగాల్లో అందజేస్తున్నాయి. ఈ రుణాలకు అవసరమయ్యే నిధుల ఆధారానికి సభ్యుల నుంచి డిపాజిట్లు సమీకరించడంతో పాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి రుణాలు కూడా పొందుతున్నాయి. సంఘాల్లో ఒక వ్యక్తి గరిష్ఠంగా రూ.10 లక్షలు డిపాజిట్ చేసేందుకు వీలుండగా, ప్రస్తుతం రూ.30 లక్షలకు పెంచుతూ సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రేటర్‌లో 19 మంది ఏసీపీల బదిలీ

ప్యారీస్, ఆగస్టు 21: గ్రేటర్ చెన్నైలో 19 మంది అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. బీఎస్పీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య అనంతరం చెన్నై సహా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖలో చేపట్టిన ఆకస్మిక మార్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే చెన్నై పోలీసు కమిషనర్ సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేశారు. ప్రస్తుతం మరో 19 మంది అసిస్టెంట్ పోలీసు కమిషనర్లు బదిలీ అయ్యారు. ఆ మేరకు ఆమ్‌స్ట్రాంగ్ హత్య జరిగిన ప్రాంతమైన సెంబియం ఏసీ ప్రవీణ్‌కుమార్ భద్రతా విభాగానికి బదిలీ అయ్యారు. పోలీసు శిక్షణ విభాగం అసిస్టెంట్ కమిషనర్ మునియస్వామి అన్నానగర్‌కు బదిలీ అయ్యారు. వీరితో పాటు మరో 17 మంది కూడా బదిలీ అయ్యారు.

అంతర్జాతీయ పోటీలకు రుబారు మిస్టర్ ఇండియా విజేత

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రుబారు మిస్టర్ ఇండియా విజేత ఆదిత్య సుబ్రమణియన్ వచ్చే నెల వెనిజులాలో జరుగనున్న పోటీల్లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. అదే విధంగా నవంబరులో వియత్నాంలో జరుగనున్న మిస్టర్ టూరిజం వరల్డ్ ఇండియా పోటీలకు మరో రుబారు మిస్టర్ ఇండియా విజేత ముస్తాక్ మహమ్మద్ దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి 30 వేలకు పైగా దరఖాస్తులు రాగా, వాటిలో 30 ఫైనలిస్టులు గ్రాండ్ ఫినాలే కోసం షార్ట్‌లిస్ట్ చేయబడ్డాయి. చెన్నైకి చెందిన ఆదిత్య, ముస్తాక్ వివిధ రౌండ్ల ఆడిషన్లు, వ్యక్తిగత ఇంటర్వ్యూ సెషన్లను దాటుకుని, ఫైనలిస్ట్‌లుగా జాతీయ పోటీల్లో తమిళనాడుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.


ఆదిత్య, ముస్తాక్‌లకు రుబారు నిర్వాహకుల సత్కారం

పాంబన్ వంతెనపై గూడ్సు రైలు ట్రయల్ రన్



పెరంబూర్, ఆగస్టు 21: పాంబన్ కొత్త రైలు వంతెనై 11 పెట్టెలతో కూడిన గూడ్సు రైలుతో బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. రామేశ్వరం పాంబన్ సముద్రంపై రూ.545 కోట్లతో కొత్త రైలు వంతెన నిర్మాణం జరుగుతోంది. పనులు తుదిదశకు చేరుకోవడంతో త్వరలో రైళ్ల రాకపోకలు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 5వ తేది రైలింజన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ సమయంలో రైలు పట్టాలు, దిమ్మెలు, స్తంభాలు తదితరాల పటిష్ఠత పరిశీలించి, స్వల్ప మరమ్మతులు పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో, బుధవారం 11 గూడ్సు పెట్టెలతో 20 నుంచి 40 కి.మీ వేగంతో ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రయల్ రన్ నిర్వహిస్తుండడంతో రైలు పట్టాలు సమీపంలో ప్రజలు, పర్యాటకులు వెళ్లడంపై నిషేధం విధించారు.

ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యం


మృతులు అఖిలేశ్వరన్, కదిరేశన్

పెరంబూర్, ఆగస్టు 21: తిరువణ్ణామలై జిల్లా మోట్టూరు కొండ గ్రామం సమీపంలోని నదిలో గల్లంతైన ఇద్దరు చిన్నారుల్లో ఒక మృతదేహం తీరానికి కొట్టుకురాగా, మరొక మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు. జవ్వాది కొండ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా కుప్పనత్తం నదిలో వరద ప్రవాహం అధికంగా ఉంది. మోట్టూరు గ్రామానికి చెందిన గోవిందరాజన్ కుమారులు కదిరేశన్ (5), అఖిలేశ్వరన్ (4) ఆ సమయంలో నది తీరంలో ఉండగా, ఊహించని విధంగా ఉధృతంగా వచ్చిన వరదలో కొట్టుకుపోయారు. వారిలో కదిరేశన్ మృతదేహం తీరానికి కొట్టుకురాగా, మరో మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 21: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

సేలయూరు: ఆండాళ్ నగర్, భాగ్యలక్ష్మి నగర్, యశ్వంత్ నగర్, పద్మావతి నగర్, భువనేశ్వరి నగర్, మల్లీశ్వరి నగర్, అంబాళ్ నగర్, జయవంతపురం, తిరుమలై నగర్

చిట్లపాక్కం: వేళచ్చేరి రోడ్డు, చిట్లపాక్కం మెయిన్ రోడ్డు, గణేశ్ నగర్, తిరుమగల్ నగర్, సిలప్పదికారం వీధి, మెహతా నగర్, రాజేశ్వరి నగర్ 100 అడుగుల రోడ్డు, అన్నై ఇందిరా నగర్, గణపతి కాలని, అన్నై నగర్, విజయలక్ష్మి నగర్, ధనలక్ష్మి నగర్, శ్రీరామ్ నగర్

అంబత్తూర్: వెళ్లాలర్ వీధి, కులక్కరై 1,2,3 వీధులు

అనకాపుత్తూర్: అన్నై థెరిస్సా వీధి, కామరాజపురం, వినాయక నగర్, ఫాతిమా నగర్, తిరువణ్ణామలై రోడ్డు, భక్తవత్సలం మెయిన్ రోడ్డు, ఈబీ కాలని, అమరన్ నగర్, జయతీర్థరావు వీధి

మనలి సాతాన్‌కాడు: ఎంజీఆర్ నగర్, విమలాపురం, శ్రీనివాసన్ వీధి, రాధాకృష్ణన్ వీధి, పూంగావనం వీధి, కామరాజర్ రోడ్డు, చిన్న చేక్కాడు, పార్థసారధి వీధి, బలిజ పాళయం, సత్యమూర్తి నగర్, టీకేబీ నగర్, వీపీ నగర్, రామస్వామి నగర్, కార్గిల్ నగర్, రాజాజీ నగర్, జయలలిత నగర్, వెట్రి వినాయగర్ నగర్, దేవరాజన్ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, పాత ఎంజీఆర్ నగర్, పెరియార్ నగర్, భారతియార్ వీధి, విలేజ్ వీధి, ఎడపాళయం, ఒత్తవాడై వీధి, జయపాల్ వీధి, పార్వతి నగర్, దేవి కరుమారియమ్మన్ నగర్, గణపతి నగర్, మూలసత్రం మెయిన్ రోడ్డు, మనలి ఏరియా.


ఢిల్లీలోని కృష్ణభవన్‌లో బుధవారం కేంద్ర వినియోగదారులు, ఆహార, ప్రజాపంపిణి శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలుసుకొని తమిళనాడుకు అందించాల్సిన ఆహార శాఖ రాయితీల సహా పలు సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర ఆహార శాఖ మంత్రి చక్రపాణి, ఎంపీ తిరుచ్చి శివ తదితరులు

మావల్లే మీకు నలుగురు ఎమ్మెల్యేలు

● అన్నామలైపై మాజీ మంత్రి జయకుమార్ ధ్వజం

ప్యారీస్, ఆగస్టు 21: అన్నాడీఎంకే పెట్టిన భిక్ష వల్లే బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలున్నారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ విమర్శలు చేశారు. ఆయన బుధవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే మంత్రుల అవినీతి కేసులకు భయపడే ఆ పార్టీ బీజేపీకి బానిసగా మారిందని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే పెట్టిన భిక్ష వల్లే బీజేపీలో నలుగురు ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి వెళ్లారని, ధైర్యం ఉంటే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేయాలని జయకుమార్ సవాల్ చేశారు.

అన్నామలై రాజకీయ అజ్ఞాని: మాజీ మంత్రి సెల్లూరు రాజు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై రాజకీయ అజ్ఞాని అని, రాజకీయాల గురించి ఆయన నేర్చుకోవాల్సింది చాలా ఉందని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూరు రాజు ఘాటుగా విమర్శించారు. ఆయన మదురైలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ... సెల్‌ఫోన్‌లో వచ్చిన ఆహ్వానం పేరుతో అన్నామలై కలైంజర్ 100 రూపాయల నాణేం ఆవిష్కరణ వేడుకల్లో పాల్గొని, డీఎంకే నేతలకు వంగి వంగి సలామ్ చేశారని అన్నారు. రాజకీయ అనుభవం లేని అన్నామలై సుమారు 2 కోట్ల మందికి పైగా కార్యకర్తలున్న అన్నాడీఎంకేను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని సెల్లూరు రాజు పేర్కొన్నారు.

శాంతి భద్రతలపై కలెక్టర్ సమీక్ష


సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 21: జిల్లాలో శాంతి భద్రతలపై బుధవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎస్పీ మదివానన్, జిల్లా రెవెన్యూ అధికారి (సర్వే శాఖ) రాజ్‌కుమార్, కలెక్టర్ పీఏ (జనరల్) ముత్తయ్య, వేలూరు కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ రాజ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన



వేలూరు, ఆగస్టు 21: సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. తమిళనాడు ఉన్నత, మహోన్నత పాఠశాలల డిగ్రీ ఉపాధ్యాయులు తమ 20 అంశాల కోరికలు నెరవేర్చాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సెల్వకుమార్, జిల్లా సెక్రటరీ జనార్దనన్, రాష్ట్ర చట్ట సెక్రటరీ గాంధీ, కోశాధికారి ధనశేఖర్ సహా 300 మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 21: జిల్లా టెన్నికాయిట్ సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు ఓటేరి తిరుక్కురల్ నగర్‌లో జరిగాయి. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ అనే మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఆనైకట్టు, గుడియాత్తం, పేర్నాంబట్టు సహా పలు ప్రాంతాల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలకు రిఫరీలుగా కోచ్‌లు జయశంకర్, జయకసుకివర్మన్ వ్యవహరించారు. విజేతలకు రాష్ట్ర టెన్నిస్ సమాఖ్య సెక్రటరీర శంకర్, వేలూరు జిల్లా అధ్యక్షుడు మనోహర్‌బాబు, సెక్రటరీ మురళి, కోశాధికారి భాస్కర్, జిల్లా క్రీడల శాఖ అధికారి సరస్వతి పాల్గొని, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ సుధాకర్, హాకీ కోచ్ శశిధరన్, దినేష్, రాజేంద్రన్, పెరుమాళ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ అందజేసిన సమాజసేవకుడు


విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, ఆగస్టు 21: వెంకటాపురంకు చెందిన విద్యార్థినులు పాఠశాలకు వెళ్లాలంటే మూడు కిలో మీటర్లు నడవాల్సి వస్తోంది. వీరి పరిస్థితి గమనించిన రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణ్ ఓ విద్యార్థినికి సైకిల్ అందజేశారు. ఆయనకు విద్యార్థిని, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మలేసియాకు ఇంప్‌కాప్స్ మందులు

ఐసిఎఫ్, ఆగస్టు 21: మలేసియాకు మందులు ఎగుమతి చేయాలని ఇంప్‌కాప్స్ సంస్థ నిర్ణయించింది. సిద్ధ, యునానీ, ఆయుర్వేద, హోమియోపతి, ప్రకృతి వైద్యం వంటి భారత వైద్య విధానాన్ని కలిగిన ఇంప్‌కాప్స్ సంస్థ తిరువాన్మియూర్‌లో పనిచేస్తోంది. ఇక్కడ తయారయ్యే మందులు విదేశాలకు ఎగుమతి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విషయమై ఆ సంస్థ డైరెక్టర్ కన్నన్ మాట్లాడుతూ... తమ సంస్థ తయారుచేసే మందులు దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఏడాదికి 35 వేల మంది రోగులు ఈ మందులు వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో, మొట్టమొదటి సారిగా మలేసియాకు ఇంప్‌కాప్స్ మందులు ఎగుమతి చేయనున్నామని తెలిపారు.

రూ.50 లక్షల మేర విక్రయమైన కరుణ నాణేలు

ఐసిఎఫ్, ఆగస్టు 21: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి బొమ్మ కలిగిన రూ.100 నాణేన్ని మంత్రులు, జిల్లా కార్యదర్శులు సహా పార్టీ శ్రేణులు రూ.10,000లకు ఆసక్తిగా కొనుగోలు చేశారు. మంగళవారం ఒకేరోజు 500 నాణేలు రూ.50 లక్షలకు విక్రయమయ్యాయి. ఈ నాణేన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ నెల 18వ తేది విడుదల చేసిన విషయం తెలిసిందే. స్థానిక అన్నా అరివాలయంలో రూ.10,000 వేలకు నాణేలను విక్రయానికి ఉంచారు. మంత్రులు, రాష్ట్ర నిర్వాహకులు, కార్యదర్శులు అంటూ వీటిని పోటీపడి కొనుగోలు చేశారు. వీటి విక్రయాలు కొనసాగనున్నాయని డీఎంకే పార్టీ కార్యాలయం తెలిపింది.

9 వేల లీటర్ల బయోడీజిల్ స్వాధీనం

ఐసిఎఫ్, ఆగస్టు 21: తూత్తుకుడిలో 9 వేల లీటర్ల బయోడీజిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ జిల్లాలో మోటారు పడవలకు వినియోగించేందుకు రాయితీ ధరకు ప్రభుత్వం డీజిల్ అందిస్తోంది. అదనంగా డీజిల్ కావాలనుకొనే వారు బంకుల్లో కొనుగోలు చేస్తుంటారు. కొందరు ధర ఎక్కువ కారణంగా డీజిల్‌తో బయోడీజిల్ కలిపి మోటార్లకు వినియోగిస్తున్నారు. తూత్తుకుడి సిప్కాట్ ఏరియాలో పోలీసులు రాత్రి గస్తీలో ఉండగా, అటువైపు ఓ లారీ వచ్చింది. దానిని అడ్డగించి తనిఖీ చేయగా 48 బ్యారల్‌లలో 9,000 లీటర్ల బయోడీజిల్‌ను గుర్తించారు. ఎలాంటి పత్రాలు లేకుండా వీటిని తరలించినందుకు పావూరుసత్రానికి చెందిన శంకర్, కడయం ప్రాంతానికి చెందిన తవమణిలను అరెస్ట్ చేసి, డీజిల్ స్వాధీనం చేసుకున్నారు.

15 మంది ఆటో డ్రైవర్లకు జరిమానా

ఐసిఎఫ్, ఆగస్టు 21: వాహన రాకపోకలకు అంతరాయం కలిగించిన 15 ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. పురుషవాక్కం హైరోడ్డులో ఫ్లై ఓవర్ సమీపంలో రోడ్డును ఆక్రమించి 25కు పైగా ఆటోలు నిలిపారు. దీంతో ఆ ప్రాంతంలో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫిర్యాదులందుకున్న పోలీసులు రోడ్డులో పార్క్ చేసిన ఆటో డ్రైవర్లకు తలా రూ.500 జరిమానా విధించి అక్కడి నుంచి పంపించి వేశారు.

ఏనుగు దాడిలో మహిళ మృతి

పెరంబూర్, ఆగస్టు 21: నీలగిరి జిల్లా కోతగిరి సమీపంలో ఏనుగు దాడిలో మహిళ మృతిచెందింది. ఏనుగులకు ఎంతో ఇష్టమైన పనస పండ్ల సీజన్ ప్రారంభమైంది. ఈ పండ్ల వాసన పసిగట్టే ఏనుగులు అడవి ప్రాంతాల నుంచి తోటలు, జనావాస ప్రాంతాల్లోకి వస్తున్నాయి. అడవి ఏనుగులు వస్తుండడంతో రాత్రి వేళ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో, వెల్లరికొంబై గిరిజన గ్రామానికి చెందిన జానకి మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న ఏనుగు దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

20 రోజుల్లో ఏడుగురు విద్యుత్ సిబ్బంది మృతి

ప్యారీస్, ఆగస్టు 21: రాష్ట్రంలో ఇరవై రోజుల్లో విద్యుత్ మరమ్మతులు చేసే ఏడుగురు ఉద్యోగులు విద్యుదాఘాతానికి గురై మరణించారు. దీనిపై ఆందోళన వ్యక్తం చేసిన కార్మిక సంఘాలు, ఉద్యోగుల కొరత కారణంగా కాంట్రాక్ట్, మాజీ ఉద్యోగులతో పనిచేయిస్తున్నారని ఆరోపించాయి. తమిళనాడు విద్యుత్ బోర్డులో ఖాళీ పోస్టులు త్వరితగతిన భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలకు సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో వాటిని సరిచేసేందుకు టీఎన్ఈబీ ఉద్యోగులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. నీలగిరికి చెందిన ఆనంద్, కళ్లకుర్చికి చెందిన ఆదియప్పన్, వాలప్పాడికి చెందిన సెల్వరాజ్, కడియనల్లూర్‌కు చెందిన సముద్రం తదితర వైర్ మ్యాన్లు, తిరుప్పూర్ జిల్లాలో దినేష్, నవీన్, జయంకొండాంకు చెందిన గ్యాంగ్‌మెన్ సెంథిల్ కుమార్ తదితరులు విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురై మరణించినట్లు కార్మిక సంఘాల నిర్వాహకులు తెలిపారు.

రైలు ఢీకొని తండ్రీకూతుళ్ల మృతి

● కళాశాలలో చేర్పించి వస్తుండగా ప్రమాదం


పిచ్చపిళ్లై - పళనియమ్మాళ్ (ఫైల్ ఫొటోలు)

పెరంబూర్, ఆగస్టు 21: అరియలూరు సమీపంలో రైలు కింద పడిన తండ్రిని కాపాడబోయిన కుమార్తె కూడా రైలు ఢీకొని మృతిచెందింది. దివ్యాంగుడైన పిచ్చైపిళ్లై, తన చిన్న కుమార్తె దేవిని తిరుచ్చిలోని ఓ కళాశాలలో చేర్పించి, తన ఇద్దరు కుమార్తెలతో ఇంటికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు బయల్దేరాడు. రైల్వేస్టేషన్ సమీపంలో ఫ్లై ఓవర్ పనులు జరుగుతుండడంతో, పిచ్చైపిళ్లై రైలుపట్టాలు దాటేందుకు యత్నించాడు. ఆ సమయంలో వస్తున్న నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌ను గమనించిన పెద్దకుమార్తె పళనియమ్మాళ్ తండ్రిని కాపాడేందుకు పరుగులుతీయగా తండ్రి, కుమార్తె ఇద్దరూ రైలు ఢీకొని మృతిచెందారు. కళ్ల ముందే తండ్రి, సోదరి మృతిచెందడంతో దేవి రోదన ప్రయాణికులను కంటతడి పెట్టించింది.

ఆవిన్ ప్లాంట్‌లో కార్మికురాలు మృతి

ప్యారీస్, ఆగస్టు 21: తిరువళ్లూర్ సమీపంలోని కాకలూరు ప్రాంతంలో ఉన్న ఆవిన్ ప్లాంట్‌లో నైట్ డ్యూటీలో ఉన్న ఉమారాణి అనే కార్మికురాలు కంటైనర్ బెల్ట్‌లో చిక్కుకుని మరణించిన ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు. కాకలూరులోని ఆవిన్ పాల ప్లాంట్‌లో 100 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కంటైనర్ బెల్ట్ నుంచి పాల ప్యాకెట్లు తీస్తున్న ఉమా రాణి హఠాత్తుగా ఆ యంత్రంలో చిక్కుకుని అక్కడికక్కడే మరణించారు. దీనిపై అందిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న తిరువళ్లూర్ ఇన్‌స్పెక్టర్ సెల్వన్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అక్కడ పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల వద్ద విచారణ చేపట్టారు.



ఇటీవల చెన్నైలో కన్నుమూసిన భారత మాజీ సైన్యాధిపతి పద్మనాభన్ అంత్యక్రియలు బుధవారం జరగ్గా, ఆయనకు అధికారిక లాంఛనాలతో వీడ్కోలు పలుకుతున్న సైనికులు, కుటుంబ సభ్యులు


చెన్నై క్వీన్ మేరీస్ కళాశాలలో జీరో యాక్సిడెంట్ డే సందర్భంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ విభాగం ఇన్‌స్పెక్టర్ మారియప్పన్



ప్రదర్శనలో ఏర్పాటుచేసిన అరుదైన వస్తువులు



పాత మద్రాసు ఫొటోలు వీక్షిస్తున్న విద్యార్థులు

చెన్నపట్నం, మద్రాసు, చెన్నై పేర్లతో సుదీర్ఘ చారిత్రక పయనంలో ఎన్నో మార్పులు సంతరించుకున్న నగరం తమిళనాడు రాజధాని. ఎన్ని పేర్లు మారినా, ఎన్ని రూపులు చేరినా.. ఉపాధి కోసం వచ్చేవారిని ఆదరించడంలో, వారిని కడుపులో పెట్టుకుని కాపాడుకోవడంలో దీనికిదే సాటి. ఈ మహానగరం గురువారం 385వ జన్మదిన వేడుకలు జరుపుకోనుంది. ఆనాడు పోర్చుగీసువారు నిర్మించిన సెయింట్ జార్జికోట, శాంతోమ్-మైలాపూర్ మధ్య నిర్మించిన మట్టిగోడ, కర్ణాటక వాలాజా నవాబు బసచేసేందుకు 17వ శతాబ్దంలో నిర్మించిన చేపాక్ ప్యాలెస్, రాయపేట అమీర్ మహల్‌లో ఆర్కాడు యువరాజ బస సహా పలు భవనాలు, కట్టడాలు, ప్రాంతాలు ఈ మహానగర చరిత్రకు చెరగని సాక్ష్యాలుగా నిలిచాయి.

- పెరంబూర్



1920లో ధాన్యం నిల్వచేసే బానలు

నేడు మద్రాస్ డే

చెన్నపట్నం.. ఎన్నో మార్పుల సమాహారం



1900లో మద్రాసు హైకోర్టు

- 386వ పడిలోకి 'మద్రాస్' నగరం
- ఎగ్మూరు మ్యూజియంలో ప్రత్యేక ప్రదర్శన

మద్రాస్ నగర ఆవిర్భావ దినోత్సవమైన 'మద్రాస్ డే'ను పురస్కరించుకొని ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎగ్మూర్‌లో ఉన్న ప్రభుత్వ మ్యూజియంలో 'మద్రాసు డే' సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రదర్శన పాఠశాల, కళాశాల విద్యార్థులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'మద్రాసు రీ విజిటెడ్' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ఈ నెల 29వ తేది వరకు కొనసాగనుంది. ప్రాచీన రాతి బొమ్మలు, మట్టి బొమ్మలు, బ్రిటీష్ వారు వినియోగించిన ఆయుధాలు, దుస్తులు, ఆభరణాలు సహా 82 రకాల బొమ్మలు ఈ ప్రదర్శనలో ఉన్నాయి. అలాగే, కూవం నదిలో ఉన్న మొసలి 1972లో పట్టాలు దాటే సమయంలో రైలు ఢీకొని మృతిచెందింది. ఈ మొసలి 5 అడుగుల పొడవుండగా, ప్రత్యేక పదార్థాలతో మొసలి రూపాన్ని తయారుచేసి దానిపై చర్మాన్ని కప్పడంతో బతికున్న మొసలిలా కనిపిస్తూ పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో భాగంగా ఈ నెల 28న ట్రెజర్ హంట్, రీల్స్, లఘుచిత్రాల పోటీలు నిర్వహించనున్నట్లు మ్యూజియమ్ కమిషనర్ కవితా రాము తెలిపారు.



అప్పటి మరచెంబు



పెట్రొమాక్స్ లైట్



ఇండో-బ్రిటీష్ నాణేలు



తాగునీటి కుండ



బరువు కొలిచే ఇనుప త్రాసు



అప్పటి వీణ



తోలు బొమ్మలు



కోచ్ అని పిలువబడే వాహనం



కత్తి




సెనెట్ హౌస్ మద్రాసు



అప్పటి థౌజండ్ లైట్స్ సమీపంలోని మౌంట్ రోడ్డు



తుపాకి



గుర్రపు బండి



సెయింట్ జార్జి కోట సమీపంలో పడవల రవాణా




బస్సు





అప్పటి ప్రయాణ వాహనం



1870లో మద్రాసు మహానగరం





1870లో పచ్చడి, పిండి రుబ్బుకొనే తిరగలి, నూరుదు బండ



అప్పటి మద్రాసు నగరంలో మానవుని దైనందిన జీవితం



1900లో హిగ్గిన్‌బోథమ్స్ దుకాణం



సెంట్రల్ రైల్వేస్టేషన్



ప్రెసిడెన్సీ కాలేజ్



1891లో మద్రాసు హార్బర్



1911లో తొలి రైలుకు ఆహ్వానం

'కొట్టుకాలి' చిత్ర బృందానికి కమల్ ప్రశంస

సూరి, అన్నాబెన్ జంటగా నటించిన 'కొట్టుకాలి' చిత్రాన్ని విశ్వనటుడు కమల్ హాసన్ తిలకించి, ఆ చిత్ర బృందాన్ని ప్రశంసల వర్షంలో ముంచెత్తారు. ఈ బృందాన్ని అభినందిస్తూ ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'బిగ్‌స్ర్కీన్‌పై కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ (సెన్సార్ సర్టిఫికేట్) కనిపించినప్పటి నుంచి చివరి క్షణం వరకు అనేక ఆశ్చర్యాలు మొదలయ్యాయి. ఇందులో నటించిన వారిలో సూరి మినహా ఇతర నటీనటులు నాకు తెలియదు. సినిమా ప్రారంభమైన మూడు నిమిషాల తర్వాత సూరి కూడా కనిపించడు. కేవలం పాండియన్ మాత్రమే కనిపిస్తాడు. పాండి పాత్రను ప్రపంచాన్ని తలకిందులుగా చూపిస్తూ పరిచయం చేసిన తీరు బాగుంది. హీరోయిన్ కళ్లలో భూమాత సహనం కనిపిస్తుంది. టైటిల్ కార్డుల్లో వచ్చే సహజసిద్ధ ధ్వనులు. ప్రకృతికి ధన్యవాదాలు. ఈ ప్రకృతిలోని ధ్వనులు ఈ చిత్రానికి సంగీతం. ఇలా అనేక ఆశ్చర్యకర అంశాలతో ఈ సినిమా రూపొందింది. మొత్తానికి 'కొట్టుకాలి' టీమ్ ఒక అద్భుతమైన హేతుబద్ధమైన కథను అందమైన సినిమా భాషలో చెప్పారు. అందుకు ప్రకృతికే కాదు నిర్మాత శివకార్తికేయన్‌కు కూడా ధన్యవాదాలు' అంటూ కమల్ హాసన్ అభినందించారు.



సూరి, వినోద్ రాజ్, కమల్, శివకార్తికేయన్

మాలీవుడ్‌లోనే కాదు కోలీవుడ్‌లోనూ క్యాస్టింగ్ కౌచ్

- హీరోయిన్ సనమ్ శెట్టి



చిత్రజ్యోతి

మలయాళ చిత్రపరిశ్రమలోనే కాదు కోలీవుడ్‌లో కూడా క్యాస్టింగ్ కౌచ్ ఉందని హీరోయిన్ సనమ్ శెట్టి సంచలన ఆరోపణలు చేశారు. అడ్జెస్ట్‌మెంట్ పేరుతో తన వద్దకు వచ్చే వారిని చెప్పుతో కొడతానని ఆమె హెచ్చరించారు. 'అంబులి', 'మాయై' వంటి పలు చిత్రాల్లో నటించిన సనమ్ శెట్టి... 'బిగ్‌బాస్' రియాలిటీ షో ద్వారా గుర్తింపు పొందారు. కోల్‌కతా మెడికో హత్యాచార ఘటనను ఖండిస్తూ నగరంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, 'ఇలాంటి హత్యాచార ఘటనలు మహిళలపై అనునిత్యం జరుగుతూనే ఉన్నాయి. మాలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ ఉన్నట్లు హేమ కమిషన్ ఒక నివేదిక తయారు చేసింది. ఇందుకు ఆమెకు ధన్యవాదాలు తెలుపుతున్నా. అడ్జెస్ట్‌మెంట్ అనేది ఒక్క మలయాళ చిత్రపరిశ్రమలోనే కాదు కోలీవుడ్‌లో కూడా ఉంది. ఇక్కడ లేదని ఏ ఒక్కరూ చెప్పలేరు. అడ్జెస్ట్‌మెంట్ అయితేనే సినిమా అవకాశం ఇస్తామంటే అలాంటి ఛాన్స్ నాకు వద్దు. సినిమా ఇండస్ట్రీలో ఉండేవారంతా అలాంటి వారని నేను చెప్పడం లేదు. నేను పనిచేసిన సినిమాల్లో అలాంటి సంఘటనలు ఎదురుకాలేదు. ఖచ్చితంగా అవకాశం వచ్చే వరకు వేచిచూడండి. సమస్యలు ఉంటాయి. మన హక్కుల కోసం మనమే పోరాటం చేయాలి' అని పేర్కొన్నారు.



ప్రశాంత్ పాండ్యరాజ్ దర్శకత్వంలో సూరి కొత్త చిత్రం

నటుడు సూరి వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా మారిపోయారు. 'విడుదలై', 'గరుడన్' చిత్రాలతో వరుస హిట్స్‌ను తన ఖాతాలో వేసుకున్న సూరి... ఇపుడు 'విలంగు' వెబ్ సిరీస్ ఫేం ప్రశాంత్ పాండ్యరాజ్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించారు. 2017లో జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా 'బ్రూస్ లీ' చిత్రానికి దర్శకత్వం వహించిన ప్రశాంత్‌కు సరైన ఆదరణ లభించలేదు. అయితే, విమల్ ప్రధాన పాత్రలో 'విలంగు' పేరుతో రూపొందించిన వెబ్ సిరీస్‌కు అనూహ్య స్పందనతో పాటు ఆదరణ లభించింది. దీంతో ఇండస్ట్రీలో ప్రశాంత్ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించారు. ఇపుడు సూరి హీరోగా కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. లార్క్ స్టూడియోస్ పతాకంపై కె.కుమార్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఇందులో నటించే నటీనటులు, పనిచేసే సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.



దర్శక నిర్మాతలతో హీరో సూరి



సాలిగ్రామం, విజయరాఘవపురంలో కొత్తగా నిర్మించిన సౌత్ ఇండియన్ సినీ, టెలివిజన్ ఆర్టిస్ట్స్ అండ్ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యాలయ భవనాన్ని బుధవారం ప్రారంభిస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు రాధారవి. ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి స్వామినాథన్, కోశాధికారి సెంథిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగముత్తుపై వడివేలు పరువునష్టం దావా

- స్పందించాలని హైకోర్టు ఆదేశం

తన గురించి నిరాధారమైన ఆరోపణలు చేసిన సహ నటుడు సింగముత్తుపై హాస్య నటుడు వడివేలు పరువునష్టం దావా వేశారు.దీన్ని విచారణకు స్వీకరించిన మద్రాస్ హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలంటూ సింగముత్తుకు నోటీసులు జారీచేసింది.హైకోర్టులో వడివేలు దాఖలు చేసిన పిటిషన్‌లో 'తాను ఇప్పటివరకు 300కు పైగా చిత్రాల్లో నటించాను.. సహ హాస్య నటుడు సింగముత్తుతో కలిసి 2000సంవత్సరం నుంచి నటిస్తున్నాం. నన్ను లక్ష్యంగా చేసుకుని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. దీంతో 2015 తర్వాత సింగముత్తుతో కలిసి నటించడం మానేశాను. ఈ నేపథ్యంలో తాంబరంలో ఒక వివాదాస్పద స్థలాన్ని నాకు విక్రయించారు. దీనికి సంబంధించి సింగముత్తుపై పెట్టిన కేసు ఎగ్మోర్ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో పలు యూట్యూబ్ చానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సింగముత్తు నాపై అనేక ఆరోపణలు చేశారు.అత్యంత హీనగా మాట్లాడారు.ఈ వ్యాఖ్యలు ప్రజల్లో, అభిమానుల్లో నా పరువు ప్రతిష్ఠలను దిగజార్చేలా ఉన్నాయి. అందువల్ల సింగముత్తు రూ.5 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని, అలాగేఇకపై నాపై అసత్య ప్రచారం చేయకుండా నిషేధం విధించాలి'అని వడివేలు దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి ఆర్ఎండీ టీకారామన్..కౌంటర్ దాఖలు చేయాలని సింగముత్తుకు నోటీసులు జారీ చేస్తూ కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.



వడివేలు, సింగముత్తు

'కావల్ కరంగల్'కు అంబులెన్స్ వితరణ



చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'అతుల్య సీనియర్ కేర్' సంస్థ గ్రేటర్ చెన్నై పోలీసు విభాగానికి ప్రత్యేక అంబులెన్స్ విరాళంగా అందించింది. చెన్నై పోలీసు విభాగం అమలు చేస్తున్న 'కావల్ కరంగల్' పథకం కోసం దీనిని అందించింది. గ్రేటర్ చెన్నై అదనపు పోలీసు కమిషనర్ కపిల్‌కుమార్ సి.శరత్కర్‌కు అత్యుల్య సీనియర్ కేర్ వ్యవస్థాపకులు శ్రీనివాసన్ తదితరులు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ అంబులెన్స్‌ను అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు తాము అంకితభావంతో పని చేస్తున్నామని, ఇప్పుడు కావల్ కరంగల్‌తో చేతులు కలపడం వల్ల తమ పరిధిని మరింత విస్తరించేందుకు వీలు కల్పిస్తుందని వివరించారు.

అంతరిక్ష ఆవిష్కరణల్లో గ్లోబల్ లీడర్‌గా భారత్

- డాక్టర్ ఆనంద్ మేఘలింగం



విలేఖరుల సమావేశంలో మయిల్‌స్వామి అన్నాదురై, ఆనంద్ మేఘలింగం తదితరులు

చెన్నై, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశం అంతరిక్ష ఆవిష్కరణలో గ్లోబల్ లీడర్‌గా వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పేస్ జోన్ ఇండియా వ్యవస్థాపకులు డాక్టర్ ఆనంద్ మేఘలింగం పేర్కొన్నారు. భారత్ సరిహద్దులను దాటుకుంటూ అద్భుతమైన మిషన్లను స్థిరంగా ప్రారంభిస్తోందన్నారు. స్పేస్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఈసీఆర్ నుంచి మొబైల్ ల్యాంచ్‌ప్యాడ్‌లో మొట్టమొదటి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఆ వివరాలను ఆనంద్ మేఘలింగం బుధవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ మయిల్‌స్వామి అన్నాదురై మాట్లాడుతూ.. తమ హైడ్రాలిక్ మొబైల్ లాంచ్‌ప్యాడ్ ద్వారా హైబ్రిడ్ రాకెట్‌ను ప్రయోగించడం అనేది ఏరోస్పేస్ టెక్నాలజీలో కొత్త బెంచ్‌మార్క్ ఏర్పాటుకు మొదటి చొరవ అని పేర్కొన్నారు.